క్లుప్తంగా

6న వాహనాల వేలం

లక్కిరెడ్డిపల్లె : వివిధ కేసులలో పట్టుబడిన, ప్రభుత్వ పరమైన నాలుగు ద్విచక్ర వాహనాలైన హోండా యూబీ, హీరో హోండా స్పెండర్ ప్లస్, హీరో ప్యాషన్ ప్రో, టీవీఎస్ ఎక్స్ఎల్ 100 వాహనాలను ఈనెల 6వ తేదీ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, ఎస్ఈబీ అన్నమయ్య వారి ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లి ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం పాట జరుపబడునని ఎస్ఈబీ సబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కావున ఆసక్తిగల వారు ఎస్ఈబీ స్టేషన్‌లో వాహనాలను తనిఖీ చేసుకొని ఎస్ఈబీ స్టేషన్‌లో రూ. 5 వేలు ఈఎండీ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

కర్ఫ్యూప్రాంతంగా సిద్దవటం



సిద్దవటం ప్రధాన బస్టాప్ వద్ద పోలసు బందోబస్తును నిర్వహించిన దృశ్యం

సిద్దవటం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంగళవారం సిద్దవటంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు సిద్దవటంలో స్వచ్ఛందంగా దుకాణాలను మూయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 144 సెక్షన్ అమలులోల ఉండటంతో ఎవరూ సిద్దవటం ప్రధాన బస్టాప్ వద్ద తిరగకూడదన్నారు. పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. దీంతో సిద్దవటం కర్ఫ్యూను తలపించింది. ఒక మెడికల్ స్టోర్, పాల దుకాణాలు మినహా మిగిలిన దుకాణాదారులు వారి దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని ఎవరూ కూడా ఊరేగింపులు, ర్యాలీలు బహిరంగ సభలు పెట్టకూడదని ఆయన ప్రజలకు తెలియజేశారు.

రాజోలి ఆనకట్టకు జలకళ



రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నదిలోకి పోతున్న వర్షం నీరు

రాజుపాళెం : పైతట్టు ప్రాంతాలైన కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు గ్రామాల్లో కురిసిన వర్షం నీరు మండలంలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం ఆనకట్ట వర్షపు నీటితో జలకళ సంతరించుకుంది. గత నాలుగైదు రోజుల కిందట ఆనకట్టలో అడపాదడపా నీరు ఉండేది. ప్రస్తుతం నీరు భారీగా రావడంతో చల్లని వాతావరణం నెలకొంది.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

మదనపల్లె సిటీ : ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తుందని డీఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. రీజియన్‌లో ఓఆర్‌లో మదనపల్లె-1 డిపో మొదటి స్థానం నిలిచినట్లు డీఎం తెలిపారు. మేలో ఓఆర్‌లో మొదటి స్థానం, కెఎంపిఎల్‌లో కూడా రెండవస్థానం నిలిచినట్లు పేర్కొన్నారు. అందరూ కలిసి కష్టపడి పని చేయాలని కోరారు. డిపోకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నెలకంటి రాఘవయ్య సేవలు మరువరానివి

కేవీపల్లె : స్వరాజ్య సంఘం స్థాపకుడు, స్వాతంత్ర్య పోరాట యోధుడు వెన్నెలకంటి రాఘవయ్య సేవలు మరువరానివని ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని కంభిరెడ్డిగారిపల్లెలో వెన్నెలకంటి రాఘవయ్య 127వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నెలకంటి రాఘవయ్య గిరిజన యానాదుల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. గిరిజన యానాదుల పిల్లల కోసం మొట్టమొదటిసారిగా గురుకుల పాఠశాలలను స్థాపించిన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో మద్దాలి ఇశ్రాయేలు, జానం గంగిరెడ్డి, పులి మల్లీశ్వరి, కోశాధికారి సిద్దు పాల్గొన్నారు.

8 నుంచి బస్సు పాసులు

మదనపల్లె సిటీ : విద్యార్థులకు బస్సుపాసులు ఈనెల 8 నుంచి ఇవ్వనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బస్‌పాస్ మాడ్యూల్‌ని అప్‌డేట్ చేస్తున్న కారణంగా 6 నుంచి 7 వరకు బస్సు పాసులు మంజూరు చేయడం లేదన్నారు. ఈ విషయం విద్యార్థులు గమనించాలని కోరారు.

రాజంపేటలో పట్టు నిలుపుకున్న ఆకేపాటి

- ప్రతి రౌండులో మెజార్టీ
- అమరన్నకే పట్టం కటిన రాజంపేట వాసులు



రాజంపేట : జిల్లా కేంద్రమైన రాయచోటిలో మంగళవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో రాజంపేట సెగ్మెంట్‌లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పట్టు నిలుపుకున్నారు. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి ప్రతి రౌండ్‌లో తమ ఆధిక్యతను సాధించుకుంటూ వచ్చారు. దీన్ని బట్టి చూస్తే రాజంపేట వాసులు అమరన్నకే పట్టం కట్టారు. తన సమీప అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంపై ప్రస్తుతం ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో మెజార్టీ సాధించడం చర్చానీయాంశంగా మారింది. తొలిరౌండ్‌లో 1,093 మెజార్టీని సాధించారు. రెండవ రౌండ్‌లో తన సమీప అభ్యర్థిపై 733 ఓట్లు మెజార్టీని సాధించారు. మూడవ రౌండ్‌లో 1,737 మెజార్టీ సాధించారు. నాల్గవ, ఐదవ రౌండ్‌లో 4,514 మెజార్టీ సాధించారు. ఆరవ, ఏడు రౌండ్‌లలో 7,259 మెజార్టీని 60వేల ఓట్లలో సాధించారు. ఎనిమిది, తొమ్మిది, పది రౌండ్‌లలో 9,888 మెజార్టీ సాధించారు. పదకొండు, పన్నెండు, పదమూడు, పద్నాలుగు రౌండ్లకు సంబంధించి తన సమీప అభ్యర్థి సుగవాసిపై 7,108 మెజార్టీ సాధించారు. పదైదు, పదారు, పదిహేడు, పద్దెనిమిది, పంతొమ్మిది, ఇరవై రౌండ్లలో ఓట్ల లెకింపు జరిగితే 8,378 మెజార్టీ సాధించారు. ఇరవై ఒకటవ రౌండ్‌తో కలిసి 7016 మెజార్టీ సాధించి విజయం కై వసం చేసుకున్నారు. దీంతో ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద నుంచి డిక్లరేషన్ ఫారం అందుకున్నారు.

తంబళ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ విజయం

- వరుసగా రెండోసారి గెలిచిన పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి
- 10,103 ఓట్ల మెజార్టీతో అభివృద్ధికి పట్టం కట్టిన ఓటర్లు
- మొత్తం 18 రౌండ్లలో 11 రౌండ్లలో ఆధిక్యం
- ఏడు రౌండ్లకే పరిమితమైన టీడీపీ



బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వరుసగా రెండోసారి విజయకేతనం ఎగురవేశారు. 2019లో తొలిసారి పోటీచేసి గెలుపొందిన ఆయన ప్రస్తుత 2024 ఎన్నికల్లోనూ సత్తా చాటుకున్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి ఓటర్ల పట్టం కట్టారు. గతనెల 13న జరిగిన ఎన్నికల్లో రెండోసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి నియోజకవర్గ ప్రజల్లో ఆదరణ ఉంది. నిత్యం ప్రజల్లో ఉండే ఆయనకు ఓటర్లు మద్దతు ఇచ్చి గెలిపించారు. నియోజకవర్గంలో 236 పోలింగ్ కేంద్రాల ద్వారా నిర్వహించిన పోలింగ్‌లో 1,87,892 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీటిలో 1,85,482 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. ఈ ఓట్లలో టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డికి 84,033 ఓట్లు పడగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి 94,136 ఓట్లు వేశారు. దీనితో టీడీపీపై పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి 10,103 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. పోలైన ఓట్లతో వైఎస్సార్‌సీపీ, టీడీపీకి పోలవగా మిగిలిన ఓట్లలో కాంగ్రెస్‌పార్టీకి 3,444 ఓట్లు, మిగిలిన ఎనిమిది మంది అభ్యర్థులకు 3,869 ఓట్లు పడ్డాయి. నోటాకు 2,384 ఓట్లు వేయగా 26 ఓట్లు చెల్లలేదు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో టీడీపీకి 1,086 ఓట్లు, వైఎస్సార్‌సీపీకి 720 ఓట్లు, కాంగ్రెస్‌కు 25 ఓట్లు వేయగా 11 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నోటాకు వేశారు.

11 రౌండ్లలో ఆధిక్యం : తంబళ్లపల్లె నియోజకవర్గంలో 236 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికలకు సంబంధించి రాయచోటి కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగింది. మొత్తం 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి 11 రౌండ్లలో ఆధిక్యత లభించింది. 4, 5, 6, 7, 8, 9, 11, 12, 14, 15, 16 రౌండ్లలో మెజార్టీ దక్కింది. మిగిలిన 1, 2, 3, 10, 13, 17, 18 రౌండ్లలో టీడీపీకి ఆధిక్యం వచ్చింది. ఓట్ల లెక్కింపు మొదటి మూడు రౌండ్లలో టీడీపీకి ఆధిక్యం దక్కడంతో ఆ పార్టీ నేతల్లో గెలుపుపై ఆశలు చిగురించాయి. ఉత్కంఠభరితంగా కౌంటింగ్ సాగింది. తంబళ్లపల్లెలో గెలుపుపై ఆశలు పెట్టుకున్న టీడీపీకి మొదటి మూడు రౌండ్లలో వచ్చిన మెజార్టీ మరింత ఆశలు పెంచాయి. అయితే నాలుగో రౌండ్ నుంచి వరుసగా వైఎస్సార్‌సీపీ స్పష్టమైన మెజార్టీతో ఆధిక్యం కనబర్చడంతో టీడీపీ శిబిరంలో నిరాశ వ్యక్తమైంది. చివరకు అన్ని రౌండ్లు పూర్తవడంతో వైఎస్సార్‌సీపీ మెజార్టీ సాధించి విజయం దక్కించుకుంది.

రౌండ్లవారీగా ఓట్ల వివరాలు

రౌండు	టీడీపీ	వైఎస్సార్‌సీపీ
1	5,276	5,140
2	5,426	5,098
3	6,564	5,284
4	4,549	4,746
5	4,270	5,435
6	3,646	6,307
7	2,485	6,595
8	3,817	6,453
9	4,980	5,777
10	6,645	4,966
11	4,771	5,471
12	4,008	4,702
13	6,060	4,822
14	5,157	5,647
15	5,556	5,818
16	4,267	5,927
17	4,640	4,439
18	830	789
పోస్టల్	1,086	720

అభివృద్ధికి పట్టం :
తంబళ్లపల్లెలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల మధ్యే పోటీ జరిగింది. ఈ ఎన్నికలో ఓటర్లు విజ్ఞత ప్రదర్శించారు. గత 75 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేసి చూపించారు. అభివృద్ధి పనులకు నిధుల వరద పారించారు. రహదారులు, ఆస్పత్రులు, గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పన, ఇతరా అభివృద్ధి పనులపై శ్రద్ధ చూపించారు. ప్రతిపల్లెకు రహదారులు నిర్మించారు. తాగునీటి కోసం వాటర్‌గ్రిడ్ మంజూరు చేయించారు.

చివరి రౌండ్ వరకు ఉత్కంఠత

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, చివరి రౌండ్‌లో స్వల్ప మెజార్టీతో టీడీపీ అభ్యర్థి ఎం.రాంప్రసాద్ రెడ్డి విజయం



రాయచోటి : సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థుల ఎన్నికల కౌంటింగ్‌లో చివరి రౌండ్ ఫలితం వరకు తీవ్ర ఉత్కంఠత కనిపించింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గడికోట శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిల మధ్య పోటీ కనిపించింది. ఈ పోరులో మధ్యమధ్యన టీడీపీ మెజార్టీ వస్తున్నా చివరి రెండు రౌండ్ల వరకు వైఎస్సార్‌సీపీకే మెజార్టీ నిలుస్తూ వచ్చింది. చివరి (20, 21) రెండు రౌండ్లలో 1200 పై చిలుకు మెజార్టీ రావడం, పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో టీడీపీ అభ్యర్థికి ఎక్కువ పడటంతో 2471 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఈవీఎంలు ద్వారా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డికి 92,481 ఓట్లు రాగా, టీడీపీకి 93,836 ఓట్లు వచ్చాయి. ఈ ఓట్లలో 1355 ఓట్లు ఆధిక్యతను సాధించారు. పోస్టల్ బ్యాలెట్ 3,491 ఓట్లను రెండు రౌండ్ల కౌంటింగ్‌లో 1140 ఓట్లు టీడీపీ అభ్యర్థికి మెజార్టీ లభించింది. దీంతో గడికోట శ్రీకాంత్ రెడ్డిపై టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్ రెడ్డి 2495 ఓట్లు మెజార్టీతో గెలుపును అందుకున్నారు.

సంబరాలలో మండిపల్లి వర్గీయులు..
రాయచోటి టీడీపీ ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గెలుపొందడంతో ఆయన వర్గీయులు సంబరాలలో మునిగిపోయారు. డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్న రాంప్రసాద్ రెడ్డికి రాయచోటి నియోజకవర్గంలోని అభిమానులు ఇంజనీరింగ్ కళాశాల బయట స్వాగతాలు పలికారు. మాసాపేట నుంచి ఠాణా, నేతాజీ సర్కిల్, ఎస్ఎన్ కాలనీ, మదనపల్లి రోడ్డు మీదుగా రింగ్ రోడ్డు వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఈ సందర్భంగా తన గెలుపునకు సహకరించిన నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ నాయకులకు రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వేకోడూరులో జనసేన గెలుపు

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా జనసేన పార్టీకి చెందిన అరవ శ్రీధర్ 11,101 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మంగళవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో నియోజకవర్గ వ్యాప్తంగా 153805 ఓట్లు పోలవగా అందులో ఈవీఎంలు ద్వారా 152366 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1439 ఓట్లు పోలయ్యాయి. ఇందులో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌కు ఈవీఎంలు ద్వారా 77,701, పోస్టల్ బ్యాలెట్ 893 మొత్తం 78.,594 ఓట్లు వచ్చాయి. 51.1 శాతం ఓట్లు జనసేనకు పడ్డాయి. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులకు 67,002 ఈవీఎంలు ద్వారా, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 491, మొత్తం 67,493 ఓట్లు వచ్చాయి. 48.88శాతం ఓట్లు సాధించారు. దీంతో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ 11,101 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.



అరవ శ్రీధర్

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. రామపల్లెకు చెందిన జి.వెంకటరమణ(90) రోడ్డుపై నడిచి వెళుతుండగా, అదే గ్రామానికి చెందిన యువకుడు పి.మల్లికార్జున(26) ద్విచక్రవాహనంలో వేగంగా వచ్చి నడిచి వెళుతున్న వృద్ధుడు వెంకటరమణను ఢీకొన్నాడు. ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడగా, మల్లికార్జునకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఎలక్షన్ మేనియా..

- టీవీలకు అతుక్కుపోయిన ప్రజలు
- రోడ్లన్నీ నిర్మానుష్యం, దుకాణాలు బంద్
- 144 సెక్షన్ అమలు, యథావిధిగా ఆర్టీసీ బస్సులు
- విజయోత్సవాలు నిర్వహించిన టీడీపీ నాయకులు

మదనపల్లె : నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఎలక్షన్ మేనియా కనిపించింది. సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రజలు ఆసక్తి కనపరిచారు. ఉదయం 8 గంటల నుంచే టీవీలకు అతుక్కుని పోయి, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను ఆసక్తిగా గమనించారు. కౌంటింగ్ సందర్భంగా నియోజకవర్గంలో పోలీసులు 144 సెక్షన్‌తో పాటుగా 30 యాక్ట్ అమలులో ఉందని ముందుగానే విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో రోడ్లపై జనసంచారం తక్కువగానే కనిపించింది. హోటల్స్, టీషాపులు, రెస్టారెంట్లు, వాణిజ్యసముదాయాలను తెరవవద్దని పోలీసులు ముందుగానే హెచ్చరించడంతో అన్ని మూతపడ్డాయి. మంగళవారం మదనపల్లెలో వారపు సంత ఉన్నప్పటికీ ఎన్నికల ఫలితాల కారణంగా బోసిపోయింది. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగినప్పటికీ, వాటిలో ప్రయాణీకులు ఏ మాత్రం కనిపించలేదు. ప్రతిరోజు వందలసంఖ్యలో రోడ్లపై రద్దీగా కనిపించే ఆటోలు అరకొరగా దర్శనమిచ్చాయి. బెంగళూరు బస్టాండ్, చిత్తూరుబస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, మల్లికార్జున సర్కిల్, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాల్లో పోలీసులు గస్తీ నిర్వహించి, జనాలు గుమికూడకుండా పంపేశారు. ప్రతి సర్కిల్ వద్ద డ్రోన్‌ల సహాయంతో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వచ్చారు. కౌంటింగ్ సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉంటుందని, ఫలితాలు వెలువరించే రోజు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, టపాకాయలు పేల్చడం చేయవద్దని పదేపదే పోలీసులు, ఎన్నికల అధికారులు చెప్పినప్పటికీ టీడీపీ నాయకులు ఖాతరుచేయలేదు. మదనపల్లె నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా ఆధిక్యంలో కొనసాగుతున్నాడని తెలిసినప్పటి నుంచే పెద్ద శబ్దాలతో టపాకాయలు పేల్చడం, టీడీపీ జెండాలు ధరించి, రోడ్లపై అరుపులు, కేకలతో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు.



కొనుగోలుదారులు లేక బోసిపోయిన వారపుసంత



నిర్మానుష్యంగా బెంగళూరు బస్టాండ్



ఆర్.ఆర్.వీధిలో మూతపడ్డ దుకాణాలు



నిర్మానుష్యంగా అవెన్యూ రోడ్డు

బద్వేలులో వైఎస్సార్‌సీపీ జయకేతనం

బద్వేలు అర్బన్/ అట్లూరు : బద్వేలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసింది. ఇక్కడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ సుధ 18567 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైన తొలి రౌండ్ నుంచే ఆధిక్యత సాధిస్తూ వచ్చారు. మొత్తంగా రెండు రౌండ్లు మినహా 18 రౌండ్లలో ఆధిక్యత కనబరిచారు. మొదటి రౌండ్‌లో డాక్టర్ సుధకు 4562 ఓట్లు లభించగా కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్నకు 3079 ఓట్లు లభించాయి. రెండవ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4535 ఓట్లు లభించగా బొజ్జా రోశన్నకు 3041 ఓట్లు, మూడవ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4689 ఓట్లు లభించగా బొజ్జారోశన్నకు 3355 ఓట్లు, నాల్గవ రౌండ్‌లో డాక్టర్ సుధకు 3526 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3319 ఓట్లు, 5వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4404 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3617 ఓట్లు, 6వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 5080 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3956 ఓట్లు, 7వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 5044 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3457 ఓట్లు, 8వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 5143 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3338 ఓట్లు, 9వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 5271 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3847 ఓట్లు, 10వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4296 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3324 ఓట్లు, 11వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4301 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3410 ఓట్లు, 12వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 3846 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 4221 ఓట్లు, 13వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4961 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 5372 ఓట్లు, 14వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 3858 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3567 ఓట్లు, 15వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4764 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3201 ఓట్లు, 16వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4717 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3613 ఓట్లు, 17వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4843 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3698 ఓట్లు, 18వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4022 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3516 ఓట్లు, 19వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 5556 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3776 ఓట్లు, 20వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 1953 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 1293 ఓట్లు లభించాయి. అలాగే పోస్టల్ బ్యాలెట్‌లో డాక్టర్ సుధకు 1039 ఓట్లు రాగా బొజ్జారోశన్నకు 1843 ఓట్లు లభించాయి. దీంతో డాక్టర్ సుధకు మొత్తంగా 90,410 ఓట్లు లభించగా బొజ్జారోశన్నకు 71,843 ఓట్లు లభించాయి.

వరుసగా నాల్గవ విజయం
బద్వేలు శాసనసభ స్థానానికి తొలిసారిగా 1955 నుంచి ఇప్పటి వరకు 18 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం తర్వాత బద్వేలు అసెంబ్లీ స్థానానికి 2014లో నిర్వహించిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జయరాములు టీడీపీ అభ్యర్థి విజయజ్యోతిపై 9502 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దివంగత డాక్టర్ వెంకటసుబ్బయ్య టీడీపీ అభ్యర్థి ఓబులాపురం రాజశేఖర్‌పై 44734 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వెంకటసుబ్బయ్య మరణానంతరం 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సుధ బీజేపీ అభ్యర్థి సురేష్‌పై 90533 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు.

ఊరూరా పటిష్ట బందోబస్తు



పీలేరు పట్టణంలో నిర్మానుష్యంగా ఉన్న రహదారులు



కేవీపల్లె : దుకాణాలు మూసేయడంతో నిర్మానుష్యంగా ఉన్న గర్నిమిట్ట గ్రామం

పీలేరు : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పీలేరు పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి, బస్టాండ్ ప్రాంతం, గ్రామ పంచాయతీ మిట్టన పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేయడంతో పాటు పోలీస్ అధికారుల సూచనల మేరకు మంగళవారం వారపు సంత రద్దు అయింది. దుకాణాలు మొత్తం మూతపడ్డాయి. వాహనాలు తిరగకపోవడం, జనసంచారం లేకపోవడంతో పట్టణ పుర వీధులు నిర్మానుష్యంగా కన్పించాయి.

నిర్మానుష్యంగా మారిన గ్రామాలు
కేవీపల్లె : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంగళవారం మండలంలోని గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమల్లో ఉండడం, ముందస్తుగా ఎన్నికల నిబంధనల గురించి పోలీసు అధికారులకు ప్రజలకు అవగాహన కల్పించడంతో ప్రజలు ఎవరూ రోడ్లపైకి రాలేదు. దుకాలు కూడా మూసి వేయడంతో ఎక్కడా జనసంచారం కనపడలేదు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొంది.



పెద్దమండ్యంలో బోసిపోయిన ప్రధాన రహదారి

పెద్దమండ్యం: మండలంలో పోలీసులు 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేశారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎక్కడా అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కర్ఫ్యూ అమలు చేశారు. దుకాణాలు మూసివేయించారు. జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుస్యాంగా మారాయి.

తంబళ్లపల్లె/ ములకలచెరువు: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు ఆంక్షలు కఠిన తరం చేశారు. తంబళ్లపల్లె, మొలకలచెరవు మండలాల్లో కర్ఫ్యూ అమలు చేయడంతో జనాలు ఎవరూ బయటకు రాలేదు. ప్రధాన వీధులు, రోడ్లు బోసిపోయాయి. హోటల్స్, టీషాపులు, రెస్టారెంట్లు, వాణిజ్యసముదాయాలను తెరవవద్దని పోలీసులు ముందుగానే హెచ్చరించడంతో అన్ని మూతపడ్డాయి.